క్లుప్తంగా

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

అంబాజీపేట: స్థానిక అంజుమన్ ఇమ్ దాదుల్ ముస్లిమీన్, మెడ్ యునైటెడ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మసీదు వీధిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్యుడు ఎండీ రఫీ తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్‌తో పాటు కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఆప్తమాలజీ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండలంలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరినగర్, గరువు, ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర కిట్లను వృద్ధులకు అందజేస్తున్న సతీష్‌రెడ్డి

రావులపాలెం: స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ ప్రెసిడెంట్ గొలుగూరి సత్యనారాయణరెడ్డి (సతీష్ రెడ్డి) పుట్టినరోజు సందర్భంగా సేవా సంస్థ సభ్యులు శుక్రవారం వృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రూ.10 వేలు విలువైన నిత్యావసరాలను నిరుపేద వృద్ధులకు సతీష్‌రెడ్డి చేతుల మీదుగా అందజేసి అభినందనలు తెలిపారు.

భారీ అన్నసమారాధనలు

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని చవితి వేడుకలను మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహిస్తూ విఘ్నాలు తొలగించాలి ఆది దేవా అని ప్రత్యేక పూజలు చేశారు. గంగలకుర్రు శివారు గుంటమామిడితోటలో వేంచేసి ఉన్న లక్ష్మీగణపతి ఆలయం వద్ద నెలకొల్పిన చవితి పందిరిలో గోవిందవర్జుల శ్రీరామమూర్తి (పండు) ఆధ్వర్యంలో భక్తులు గణపతికి హోమాలు, దుర్వార్చన, అభిషేకాలు నిర్వహించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం రామాలయం వద్ద వినాయక పందిరిలో విఘ్నేశ్వరుడికి లక్ష గరికపూజ, ప్రత్యేక పూజలు చేశారు. పోతాయిలంకలో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం ఈ ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు చేపట్టారు.

మంచినీటి ప్రాజెక్ట్ ఫిల్టర్ బెడ్‌కు శంకుస్థాపన



ముంగండలో మంచినీటి ప్రాజెక్ట్ అదనపు ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: ముంగండ మంచినీటి ప్రాజెక్ట్ ఆవరణలో రూ.25 లక్షలతో అదనపు ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాలకు సరిపడా తాగు నీరు సరఫరా చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో అదనపు ఫిల్టర్ బెడ్ నిర్మిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం, జేఈ కల్యాణ చక్రవర్తి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు కుసుమ చంద్రకళ, వడలి కొండయ్య, బొండాడ నాగమణి పాల్గొన్నారు

క్రీడాకారులకు అభినందనలు

రావులపాలెం: సౌత్ జోన్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. అథ్లెటిక్స్‌లో అండర్-20 విభాగంలో తమ కళాశాలకు చెందిన ఎస్.బ్లెస్సీ, యు.దీప్తి, డి.భీమారావు, ఎం.జనార్దన్, పి.అవినాష్‌కుమార్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని అభినందించారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

ఆత్రేయపురం: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంపీడీఓ నాతిబుజ్జి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చేసిన తరువాతే ప్రజలకు తాగు నీటిని పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వై.శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతించినది

- ముంపులోనే రోడ్లు
- ప్రజలకు తప్పని కష్టాలు

మామిడికుదురు: గోదావరి వరద శాంతించినా.. మామిడికుదురు మండలంలోని మూడు గ్రామాలను ఇంకా ముంపు వీడలేదు. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన అప్పనపల్లి వెళ్లే ప్రధాన రోడ్డుపై శుక్రవారం రెండడుగుల మేర వరద పొంగి ప్రవహిస్తోంది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు వరద నీటిలో తీవ్ర ఇబ్బందుల నడుమ రాకపోకలు సాగిస్తున్నారు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన అప్పనపల్లి కాజ్వేపై వరద నీరు నాలుగడుగుల మేర ప్రవహిస్తోంది. నాలుగు రోజుల క్రితం ఈ మార్గంలో నిలిపి వేసిన రాకపోకలు ఇంకా పునరుద్ధరణకు నోచుకోలేదు. ఈ మార్గంలో రోడ్డు మార్గం ముంపు నుంచి బయట పడేందుకు సమయం పడుతుందని చెబుతున్నారు. పాశర్లపూడి, పాశర్లపూడిలంక మత్స్యకార ప్రాంతాలకు వెళ్లే మార్గంలో వరద నీరు తగ్గడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పెదపట్నం గ్రామంలోని రత్నాపురంతో పాటు అరుంధతీపేటలో కూడా వరద ప్రవాహం తగ్గింది. కాగా గోదావరి వరద ఉధృతితో నదీకోత పెరిగిపోయిందని, కోత నివాస గృహాలను సమీపించిందని అప్పనపల్లి గ్రామానికి చెందిన తీర ప్రాంత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.



అప్పనపల్లిలో వరదనీటిలో ఇబ్బందులు

తగ్గుముఖం పట్టిన వరద

అయినవిల్లి: ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై వరద తగ్గుముఖం పట్టింది. కాజ్‌వేపై పడవల సాయంతో లంక గ్రామాల్లో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వరదనీటిలో అయినవిల్లిలంక, పొట్టిలంక, వీరవల్లిపాలెం, మదుపల్లిలంక, చింతనలంక పలు పల్లపు ప్రాంతాల్లో ఉన్న పూరిపాకలు, ఇళ్లు వరదనీటిలో నానుతున్నాయి. పశువులకు మేతల్లేక పస్తులతో ఉసూరుమంటున్నాయి. రైతులు తమ పంటలు వరదనీటిలో మునిగిపోవడంతో ఆవేదన చెందుతున్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నిలకడగా గోదారమ్మ

ఆలమూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గౌతమీ గోదావరి నదిలో గత వారం రోజుల నుంచి ఉధృతంగా ప్రవహించిన గోదారమ్మ పరవళ్లు శుక్రవారం నిలకడగానే ఉంది. నదీ గర్భంలోని బడుగువానిలంక చుట్టూ ఉన్న పాయల్లో వరద నీరు వచ్చి చేరినా గ్రామంలోకి ఇంకా ప్రవేశించకపోవడంతో స్థానికులకు ఊరట నిస్తుంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండటంతో ఆ మేరకు ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు.

వరద ముంపులోనే లంక గ్రామాలు

సఖినేటిపల్లి: గత వారం రోజులుగా కొనసాగుతున్న వరద ఉధృతితో లంక గ్రామాలు శుక్రవారం కూడా వరద ముంపులోనే ఉన్నాయి. ఇప్పటికీ యథాస్థితి ఉండడంతో లంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఎగువ ప్రాంతాలలో వరద ఉధృతి తగ్గినా కూడా దిగువకు వస్తున్న వరద నీటి ప్రవాహంతో టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి లాకుపేట ప్రజలు అవస్థలు పడుతున్నారు. సఖినేటిపల్లి రేవు వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. అప్పనరామునిలంకలోని డాక్టర్ అంబేద్కర్ సెంటర్‌తో పాటు ఇతర 13 ఏరియాల్లో వరద ముంపు కొనసాగుతోంది. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి పడవలపై అప్పనరామునిలంకకు స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. సఖినేటిపల్లి లాకుపేటలో కూడా వరద ముంపు కొనసాగుతోంది. సఖినేటిపల్లి లాకులు వద్ద నుంచి పడవలపై వారు లాకుపేటకు రాకపోకలు సాగిస్తున్నారు. టేకిశెట్టిపాలెం అగ్నికుల క్షత్రియ కాలనీ ఇంకా జలదిగ్బంధంలో ఉంది. మండలంలోని ఆయా వరద ముంపు గ్రామాల్లో పడవలపై టిన్ల ద్వారా తాగునీటి పంపిణీ కొనసాగుతోంది. అప్పనరామునిలంక గ్రామానికి సఖినేటిపల్లి, టేకిశెట్టిపాలెం సరిహద్దుల్లోని రెండు కాజ్‌వేలు ఇప్పటికీ జలదిగ్బంధంలో ఉన్నాయి. అలాగే అప్పనరామునిలంక, రామరాజులంక మధ్య ఉన్న ప్రధాన రహదారి కూడా జలదిగ్బంధంలో ఉంది.



అప్పనపల్లి కాజ్‌పై ప్రవహిస్తున్న వరద నీరు



జొన్నాడలో రెండు వంతెనల మధ్య నిలకడగా ప్రవహిస్తున్న గోదారమ్మ



అప్పనరామునిలంక, రామరాజులంక మధ్య వరదనీటిలో ఉన్న ప్రధాన రహదారి

తగ్గుతున్న వరద ఉధృతి

పి.గన్నవరం: కోనసీమలోని వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. దీంతో లంక గ్రామాలు వరద ముంపు నుంచి బయట పడుతున్నాయి. కె.ఏనుగుపల్లి, జొన్నల్లంక రహదారులపై వరద తగ్గడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

మానేపల్లి శివారు శివాయలంక ప్రజలు ఇంకా పడవలపై వస్తున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. జి.పెదపూడి ఏటిగట్టు నుంచి బూరుగులంకకు వెళ్లే సీసీ రోడ్డు వరదముంపు నుంచి బయటపడింది. దీంతో రేవు వరకూ వాహనాలు వెళ్తున్నాయి. జిల్లా సరిహద్దులో ఉన్న అయోధ్యలంక, పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగర్లంక ప్రజలు పడవలపైనే వెళ్తున్నారు. వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో కొత్తపేట ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, పి.గన్నవరం తహసీల్దార్ శ్రీపల్లవి పర్యటించారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మామిడికుదురులో నిర్వహించిన అవగాహన ర్యాలీ

మామిడికుదురు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టేందుకు ప్రజల సహకారం అవసరమని ఐసీడీఎస్ సీడీపీఓ డి.వెంకటేశ్వరి సూచించారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న సీడీపీఓ వెంకటేశ్వరి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రోత్సహించే వారిపైన, బాల్య వివాహాలు జరిపించే వారిపైన కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతోనే అరికట్టవచ్చన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన, పౌష్టికాహారం మాసోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.అన్నపూర్ణ, పి.విజయలత, ఎస్.సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.అన్నపూర్ణ, ఎంటి రమాబాయి, స్కూల్ టీచర్ బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే సమగ్రంగా చేయాలి



పీహెచ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ జ్వరాలతో బాధపడుతున్నారని ఇంటింటికీ ఫీవర్ సర్వేను సమగ్రంగా చేయించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ముక్కామల పీహెచ్‌సీలో వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ రెండు రోజులు కంటే జ్వరం, జలుబు, దగ్గు ఉంటే వెంటనే వైద్యాధికారులను సంప్రదించేలా రోగులకు అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీలో అన్ని రకాల వాటికి రక్త పరీక్షలను ఉచితంగా చేస్తారని వివరించాలన్నారు. సమావేశంలో వక్కలంక సర్పంచ్ వాసంశెట్టి రేవతి, స్థానికులు వాసంశెట్టి పెదబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మేజర్ డ్రైన్స్ ఆక్రమణలపై జెడ్పీటీసీ ఆగ్రహం

ఆత్రేయపురం: పంట పొలాల్లో మురుగునీరు పోయే మేజర్ డ్రైనేజీలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని జెడ్పీటీసీ బోణం సాయిబాబా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీడీఓ నాతి బుజ్జి ఆధ్వర్యంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో జెడ్పీటీసీ బోణం సాయిబాబా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలి గ్రామంలో ఇరిగేషన్ మేజర్ డ్రైన్‌లు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న సమయంలో డ్రైనేజీ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా ఆక్రమణ నిర్మాణాలను అడ్డుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు సమావేశాలకు డ్రైనేజ్ శాఖ అధికారులు డుమ్మా కొట్టడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో పలువురు సభ్యులు గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. భూ యజమానులు ప్రమేయం లేకుండానే గ్రామ వీఆర్వోలు కౌలు రైతుల రికార్డులు మంజూరు చేస్తున్నారని అందువలన ఈ పంట నమోదులో భూ యజమానుల పేర్లు నమోదు కావడం లేదని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో సమస్యను పరిష్కరించకపోతే ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఇబ్బందులు ఏర్పాడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీలు పెన్మెత్స బంగార్రాజు, నిచ్చెనకోళ్ల రాణి, ఎంపీటీసీలు పాల రమణ, వెంకన్నబాబు, సర్పంచ్‌లు పాలా నాగేశ్వరరావు, మెర్ల రాము, గాదిరాజు రామకృష్ణంరాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ బోణం సాయిబాబా

5కే రన్‌లో పల్లవికి ద్వితీయ స్థానం

కొత్తపేట: జిల్లా స్థాయి 5కే రన్‌లో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని వై.పల్లవి ద్వితీయ బహుమతిని అందుకుంది. ఇటీవల ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అమలాపురం ఏరియా ఆస్పత్రి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్‌లో పాల్గొన్న విద్యార్థుల్లో స్థానిక డిగ్రీ కళాశాల బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ద్వితీయ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. శుక్రవారం అమలాపురంలో జరిగిన బహుమతుల ప్రదానంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సీహెచ్ భరతలక్ష్మి చేతుల మీదుగా పల్లవికి రూ.4 వేల చెక్, సర్టిఫికెట్ అందచేశారు. పల్లవిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థిని పల్లవికి సర్టిఫికెట్, చెక్ అందజేస్తున్న ఏడీఎంహెచ్‌ఓ భరతలక్ష్మి

దుమ్ము సమస్యపై వ్యాపారుల నిరసన

మామిడికుదురు: జాతీయ రహదారి పనుల్లో వేసిన మెటల్‌ను నీటితో తడపకపోవడం వల్ల విపరీతంగా దుమ్ము, ధూళి వస్తున్నాయని, వాటితో నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నామంటూ పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్‌లో వ్యాపారులు శుక్రవారం ధర్నా చేశారు. 216వ నంబర్ జాతీయ రహదారిపై నిల్చుని నినాదాలు చేశారు. ఏ వాహనం వెళ్లినా దారుణంగా దుమ్ము, ధూళి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత పది రోజుల నుంచి ఈ సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందారు. రోజూ విధిగా రోడ్డును తడిపి ధూళి, దుమ్ము సమస్య నుంచి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పేకేటి భాస్కర్, గుత్తుల శ్రీనివాసరావు, నంబు బుజ్జి, రావుల పురుషోత్తమ్, శింగంశెట్టి తోట రామకృష్ణ, చప్పిడి శ్రీనివాసు, బొరుసు ప్రసాద్, దండు రాజు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళులు

మలికిపురం: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని పలువురు సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మలికిపురంలో సీపీఎం కార్యాలయం వద్ద సీతారాం చిత్రపటం వద్ద నాయకులు ఈ మేరకు నివాళులర్పించారు.

రాజోలులో..

రాజోలు: ఏచూరి సీతారాం మృతి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పీతల రామచంద్రరావు అన్నారు. శుక్రవారం రాజోలు అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచి ఏచూరి ఉద్యమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొనేవారన్నారు.

రైతుల ప్రయోజనాలను పరిరక్షించాలి

ఆలమూరు: రైసుమిల్లర్లు అందరూ వ్యాపార దృక్పథంతో పాటు రైతుల ప్రయోజనాలను పరిరక్షించాలని రాష్ట్ర శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో శుక్రవారం నియోజకవర్గ రైసు మిల్లర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించగా మాజీ డిప్యూటీ చైర్మన్ ఆర్ఎస్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు కొత్తపేట నియోజకవర్గ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగాను కార్యదర్శిగా సత్తి బామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రాయుడు సుభాకర్, సయ్యపరాజు బంగార్రాజు, కోశాధికారిగా వెత్సా సూర్యకోటి ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శిగా ఉండమట్ల పరమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కమిటీకి సహచర సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి మెమెంటోలను బహూకరించారు. రైసు మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనసాగనున్నారని నూతన అధ్యక్షుడు పాపారావు తెలిపారు.

అలరించిన పౌరాణిక నాటక ప్రదర్శనలు

కొత్తపేట: స్థానిక కళానగర్ సిద్ధివినాయకస్వామి ఆలయం వద్ద గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో గురువారం రాత్రి కురుక్షేత్రం, సత్యహరిశ్చంద్ర పౌరాణిక రంగస్థల నాటకాల్లోని వివిధ ఘట్టాల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. గత కొన్నేళ్లుగా ఆదరణ తగ్గి, కనుమరుగైన పౌరాణిక రంగస్థల నాటకాలను, ఆ కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రముఖ న్యాయవాది, ఆలయ కమిటీ కన్వీనర్ గాలిదేవర పుల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో తొలిసారిగా ఆ ఉత్సవ పందిరిలో ప్రముఖ కళాకారులతో పద్యనాటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కురుక్షేత్రం నాటకంలో ఒకరిని మించి ఒకరు అన్నట్టుగా అభినయించి తమ నటనాకౌశలాన్ని ప్రదర్శించి ప్రేక్షకులతో ప్రశంసలందుకున్నారు. కార్యక్రమంలో పాలూరి సత్యానందం, ప్రముఖ వ్యాపారవేత్తలు వానపల్లి శ్రీనివాస్, శిరిగినీడి నాగేశ్వరరావు, కళా ప్రోత్సాహకులు, ఎం.సుబ్బారావు, ఆనాల, రావుల త్రిమూర్తులు, వులుసు సుబ్బారావు, కళాభిమానులు పాల్గొన్నారు.



కొత్తపేట కళానగర్ పందిరిలో కురుక్షేత్రం నాటకంలో ధుర్యోధన, శ్రీకృష్ణుడు, అర్జునుడి సన్నివేశం

చికిత్సకు రూ.20 వేల సాయం



సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. మండలంలోని వెదిరేశ్వరానికి చెందిన యడ్లపల్లి నిఖిల్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రోజుకు రూ.లక్ష ఖర్చవుతుందని ఇప్పటి వరకు రూ.8 లక్షలు అయిందని తల్లి విజయకుమారి తెలిపారు. అంత స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరడంతో వైద్యం నిమిత్తం రూ.20 వేల నగదును సంస్థ సభ్యులు అందజేశారు.

అనారోగ్య బాధితుడికి రూ.28 వేల సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న తోటి విద్యార్థికి సహచర విద్యార్థులు, అధ్యాపకులు సాయం అందించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మానేపల్లి కార్తీక్‌కి రెండు కిడ్నీలు పాడైపోయాయి. అనారోగ్యంతో కాకినాడ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. రోజూ డయాలసిస్ చేసి చికిత్స అందిస్తున్నారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో కూలి పనులు చేసుకొని జీవిస్తున్నారు. కిడ్నీ మార్పిడికి రూ.లక్షలలో ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. దీంతో కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కలసి రూ.28 వేల ఆర్థిక సాయాన్ని కార్తిక్ తల్లికి కళాశాలలో శుక్రవారం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని తల్లిదండ్రులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు కోరారు.



విద్యార్థి తల్లికి సాయం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు

దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

మలికిపురం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా దశల వారీగా ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేస్తా మని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల మాలల జేఏసీ నాయకులు సమావేశమై ఈ మేరకు ఉమ్మడి నిర్ణయం తీసుకున్నారు. మలికిపురం పూలే-అంబేడ్కర్ సామాజిక భవనంలో మాలల న్యాయపోరాట సమితి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుల సమావేశాన్ని కోర్ కమిటీ సభ్యులైన గెద్దం ఫిలిప్ రాజ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాలలందరూ పార్టీలకు అతీతంగా వ్యతిరేకించాలన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు రాపాకను జేఏసీ నాయకులు రివ్యూ పిటిషన్ వేయాలని కోరగా దానికి ఆయన అంగీకరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల జేఏసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పంటకాలువను బాగు చేయండి

మలికిపురం: లక్కవరం గ్రామం మీదుగా వెళ్తున్న చింతలపల్లి మెయిన్ చానల్‌ను బాగు చేయాలని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు కోరారు. శుక్రవారం ఆయన కాలువ తీరును పరిశీలించారు. ఈ కాలువ విశ్వేశ్వరాయపురం వరకూ ప్రవహిస్తుందన్నారు. లక్కవరం ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న కాలువలో గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోయి నీరు కిందకు పారడం లేదన్నారు. నీరుపారుదలకు రైతులు ఇబ్బందులు పడుతున్నందున ఈ కాలువను బాగు చేయాలని ఆయన అధికారులను కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వరుణ్ ఎంపిక



దుర్గావరుణ్

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి జావెలిన్‌త్రో పోటీలకు ఇరుసుమండలో ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థి నేల అంజనీ దుర్గా వరుణ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం సునియాల్, పీఈటీ శాంతిరాజు తెలిపారు. స్థానిక స్కూల్‌లో అంజనీదుర్గా వరుణ్‌ను శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

డాక్టర్ సీతానంతం అవార్డుకు చలపతిరావు ఎంపిక



చలపతిరావు

అంబాజీపేట: స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి, ప్రధాన కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌బీవీ చలపతిరావుకు డాక్టర్ సీతానంతం ఎక్స్‌లెన్స్ ఇన్ బయోకంట్రోల్ రీసెర్చ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు బెంగళూరుకు చెందిన అసోసియేషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ హార్టికల్చర్ ఈకో సిస్టమ్ (ఏఏపీఎంహెచ్ఈ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ (ఐఐహెచ్ఆర్) చీఫ్ ఎడిటర్, పెస్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ హార్టికల్చరల్ ఈకో సిస్టమ్ (పీఎంహెచ్ఈ) చైర్మన్, ఐసీపీపీహెచ్ 2024 అవార్డు కమిటీ నుంచి డాక్టర్ సీతానంతం అవార్డుకు ఎంపికైనట్లు శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయన్నారు. అవార్డుకు ఎంపికైన చలపతిరావును స్థానిక శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో రోహిత్‌కు ప్రథమ స్థానం

రావులపాలెం: సౌత్ జోన్ అథ్లెటిక్స్ కోనసీమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై అథ్లెటిక్స్ అండర్-14 బాలుర విభాగంలో స్థానిక భాష్యం పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి బి.రోహిత్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ జె.సూరిబాబు శుక్రవారం తెలిపారు. అలాగే ఎస్‌జీఎఫ్ఐలో షాట్‌పుట్ విభాగంలో అండర్-17 కేటగిరిలో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రోహిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీటీ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లార్వా నిర్మూలనకు ఆయిల్ బాల్స్ విడుదల

మామిడికుదురు: దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా నగరం గ్రామంలో వర్షపు నీరు నిల్వ ఉన్న గుంతల్లో దోమల వ్యాప్తి కారక లార్వా నిర్మూలనకు శుక్రవారం ఆయిల్ బాల్స్‌ను విడుదల చేశారు. ఆయిల్ బాల్స్ వల్ల దోమల వ్యాప్తి కారక లార్వా నిర్మూలన అవుతుందని హెల్త్ అసిస్టెంట్ ఎం.ఏడుకొండలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంలు చంద్రకుమారి, సునీత, ఎంఎల్‌హెచ్‌పీ సునీత పాల్గొన్నారు. పారిశుధ్య చర్యల్లో భాగంగా మామిడికుదురు, పాశర్లపూడిలంక గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించారు. ఎబేట్ మందు స్ప్రే చేయించారు. సర్పంచ్‌లు గౌస్ మొహిద్దీన్, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లూటుకుర్రులో పావంచా ప్రారంభం

మామిడికుదురు: లూటుకుర్రు వీరన్న వారధి వద్ద వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్ చెంతన గ్రామ పంచాయతీ నిధులు రూ.2.90 లక్షలతో నిర్మించిన పావంచాను సర్పంచ్ అడబాల తాతకాపు శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ తాతకాపు, చక్రావతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పావంచాను ప్రారంభించారు. తాతకాపు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులతో గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, స్థానికులు విళ్ల సుబ్బారావు, పాలూరి ఆదిలక్ష్మి, కడలి నూకరాజు, లంక డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో వారం రోజులుగా ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. మేజర్ పంచాయతీ కావడంతో గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ వర్షపునీరు నిలిచింది. దీంతో రోగాల ప్రబలే ప్రమాదం ఉండటంతో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. ముంపు నీటిని పొక్లెయిన్ సాయంతో బోదెలు వేసి మళ్లిస్తున్నారు.ఇప్పటికే గ్రామంలో పలు ప్రాంతాల్లో ముంపునీటిని, పోగుచేసిన చెత్తను తరలించారు. అలాగే బ్లీచింగ్, ఎబేట్ మందు స్ప్రే, ఫాగింగ్ చేయించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సర్పంచ్ వార జయసావిత్రి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.